# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- మాతృభాషను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో "ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు" నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- సాంకేతికత వినియోగం ద్వారా నేరాల శాతాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు.
- సాలూరులోని వంద పడకల ఆసుపత్రి త్వరలో ప్రజలకు అందుబాటులోనికి రానుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి వెల్లడించారు.
- రాష్ట్రంలో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ కృషి చేస్తోందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు.

========================

ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహించుకోవడం తెలుగువారికి గర్వకారణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మాతృభాషను భవిష్యత్ తరాలకు పదిలంగా అందించడమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ కార్యక్రమం జరిగే ప్రాంగణానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును పెట్టడం, ఆ మహానుభావుడు తెలుగు జాతి కోసం చేసిన త్యాగాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తోందన్నారు. తెలుగు భాషాభివృద్ధి కోసం గణనీయ కృషి చేసిన రామోజీరావు పేరు ప్రధాన వేదికకు పెట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ మహాసభలకు విచ్చేసిన అతిథులకు, పాల్గొంటున్న తెలుగు భాషాభిమానులకు ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ.. నిర్వాహకులకు చంద్రబాబు నాయుడు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

========================

రాష్ట్ర ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యం అని ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ద్వారకా తిరుమల రావు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో

2024 ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ వార్షిక నివేదికపై డీజీపీ ఈరోజు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... నేరాల నియంత్రణకు సాంకేతికను అధికంగా వినియోగించామని అన్నారు. పోలీస్ సేవల్లో డ్రోన్ల వినియోగాన్ని విస్తరించునున్నట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. దేశంలో డిజిటల్ అరెస్ట్ లు అనేవి ఎక్కడా లేవని, డిజిటల్ అరెస్ట్ అనే మాటను ఎవ్వరూ నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రానున్న రోజుల్లో గంజాయిని పూర్తిగా నియంత్రిస్తామని... వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం అని డిజిపి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

విధి నిర్వహణలో ఉన్న అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో సీఏ జవహర్ బాబుపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. నిన్న జరిగిన దాడి ఘటనలో గాయపడి ప్రస్తుతం కడప రిమ్స్ జీజీహెచ్ లో చికిత్స పొందుతున్న జవహర్ బాబును ఉప ముఖ్యమంత్రి ఈరోజు పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపిడివో కుటుంబ సభ్యులతో మాట్లాడి... ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

========================

భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2025 సంవత్సరానికి ప్రత్యేకంగా రూపొందించిన కేలండర్, డైరీను ఈరోజు ఆవిష్కరించారు. ఈ కేలండర్‌లో రాజ్యాంగ రచనలో పాల్గొన్న తెలుగు ప్రముఖులను స్మరించుకునే విధంగా రూపొందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఉపసభాపతి కె రఘు రామకృష్ణ రాజు పాల్గొన్నారు. అలాగే ముఖ్యమంత్రి శాసన వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల దృష్టికి తీసుకురావడానికి శాసన వ్యవస్థ అధికారిక ఖాతాలను ప్రారంభించారు. 'ఎక్స్', YouTube (@Legis Andhra), Instagram, Facebook (@legisandhra) ద్వారా శాసనసభ కార్యకలాపాలను ప్రజలకు చేరువ చేస్తామని తెలిపారు. ఈ ప్రయత్నం శాసన వ్యవస్థ పని తీరును ప్రజల వరకు మరింత సులభతరం చేస్తుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు.

విరామం

========================

రాబోయే మూడు నెలల్లో పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని వంద పడకల ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోనికి వస్తుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సాలూరులోని ఆసుపత్రి నిర్మాణన్ని మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎక్కువ పంచాయితీలు ఉన్న సాలూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ఈ ప్రాంత ప్రజలు విజయనగరం, విశాఖపట్నంలోని పెద్ద ఆసుపత్రులకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతోందని, ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, తక్షణమే 4 కోట్ల రూపాయల నిధులు ఆసుపత్రి నిర్మాణానికి మంజూరు చేశారని తెలిపారు. అతి త్వరలోనే నాణ్యమైన, పూర్తి స్థాయి పరికరాలతో ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేస్తామని, ఆసుపత్రికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా సోలార్ పేనల్స్ ఏర్పాటు చేస్తామని మంత్రి వివరించారు.

========================

తెలుగు భాషా, సంస్కృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు రచయితల 6వ మహాసభల్లో ఈరోజు ఆయన పాల్గొని ప్రసంగిస్తూ.. "తెలుగు భాషను కాపాడుకుందాం... ఆత్మాభిమానాన్ని పెంచుకుందాం.." అనే నినాదంతో ఐక్యత చాటేందుకు ప్రపంచ నలుమూలల నుంచి ఈ మహాస్యభలకు రచయితలు తరలిరావడం ఎంతో ఆనందంగా ఉందని

పేర్కొన్నారు. వారందరికీ తన వందనాలు తెలుపుతున్నానని అన్నారు. తెలుగును పరిపుష్టం చేసేలా ప్రభుత్వాలు పత్రికలు, ఛానళ్లు పాటు పడాలని ఆయన ఆకాంక్షిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

========================

అందరికీ ఆమోదయోగ్యమైన ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ కృషి చేస్తోందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు  పేర్కొన్నారు. విజయవాడలోని పెటర్నరీ కాలనీలో శిథిలావస్థకు చేరిన యూత్ హాస్టల్ భవనాన్ని ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానికులకు, అసోసియేషన్ సభ్యులకు ఆమోదయోగ్యమైతే యూత్ హాస్టల్ స్థలంలో  శాప్ ఆధ్వర్యంలో క్రీడాప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దీనికి సంబంధించిన విధి విధానాలను పూర్తి చేసి శాప్ సహకారంతో అందరికీ ప్రయోజనకరంగా ఉండే మల్టీపర్పస్ ఇండోర్ హాలు, స్పోర్ట్స్ రెసిడెన్సియల్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

========================

గ్లోబల్ క్వాలిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండెక్స్ లో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 5వ స్థానాన్ని సొంతం చేసుకుందని బెంగళూరుకు చెందిన (NABL) డైరెక్టర్ ఆర్ శ్రీకాంత్ తెలిపారు. ఈరోజు ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో గుణవత్ యాత్ర పేరుతో ఎన్.ఎ.బి.ఎల్ అక్రిడిటేషన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.శశిభూషణ్ రావు ప్రారంభించగా ముఖ్యవక్తగా ఎన్.ఏ.బి.ఎల్ డైరెక్టర్ ఆర్.శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని వివిధ ప్రయోగశాలల నాణ్యతా ప్రమాణాలను “నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబరేషన్ లేబరేటొరీస్” ద్వారా నిర్ధారించనున్నట్లు తెలిపారు. వ్యవసాయం, ఆహారం, వైద్యం, రక్షణ, ఉత్పాదక, పారిశ్రామిక, సాంకేతిక విద్యా సంస్థల్లో నడిచే ప్రయోగశాలలు తమపరిధిలోకి వస్తాయని తెలియజేశారు.

========================

పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 31వ తేదీన నిర్వహించనున్న యువజన ఉత్సవాలను వాయిదా వేస్తున్నామని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కే. వెంకట ఉజ్వల్ ఈరోజు ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించడం జరిగిందని, ఈ మేరకు యువజన ఉత్సవాలను వాయిదా వేస్తున్నామని తెలిపారు. తదుపరి నిర్వహణ తేదీలను ప్రకటిస్తామని, వాటిని గమనించి యువత హాజరు కావాలని కోరారు.

========================

పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితుల భూ సమస్యలను త్వరితగతిన  పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుండి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్, చింతూరు ఆర్ అండ్ ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో  ముంపు బాధితుల భూ సమస్యలపై కలెక్టర్ దృశ్య మాధ్యమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... చింతూరు డివిజన్ లోని కూనవరం, చింతూరు, ఏటపాక, విఆర్ పురం మండలాలకు సంబంధించిన పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులు, రైతులకు వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూములను చూపించాలని సూచించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లో భాగంగా గిరిజనేతరులకు గోకవరంలో భూములు కేటాయింపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు.

========================

========================